క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌సీపీడీసీఎల్-11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. బౌద్ధనగర్ ఫీడర్ పరిధిలో ఉస్మానియా యూనివర్సిటీ, డీటీఆర్ కెఫ్, అమీనాషాపు, కెనరాబ్యాంకు గల్లీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సత్కారం



ముషీరాబాద్: ఇటీవల ప్రకటించి ఈ-సెట్‌లో రాష్ట్ర స్థాయి 7వ ర్యాంకు సాధించిన శ్రీనైనిషా, తల్లి పుష్పలీలను బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్, ముషీరాబాద్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మాదేశి కళావతిలు సత్కరించి అభినందించారు. నేటి విద్యార్థులు రేపటి పాలకులుగా ఎదగాలని రాజేందర్ ఆకాంక్షించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని నల్లకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిత్యార్థ సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవితాతిరుమల్‌రావు ఆధ్వర్యంలో నోటుబుక్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఓఎన్‌జీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కుమారస్వామిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు కల్పనా యాదవ్, అంజియాదవ్, వీ.డీ.కృష్ణ, మంగ తదితరులున్నారు.

పీవీ జిల్లాను ఏర్పాటు చేయాలి

నల్లకుంట: బహుభాషాకోవిదుడు, మాజీ దివంగత ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఈ నెల 28 లోపు రాష్ట్రంలోని ఏదైనా ఒక జిల్లాకు పీవీ పేరు పెట్టాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు సీఎం కేసీఆర్‌ను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం దివంగత పీవీ శత జయంతి ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందని కొనియాడారు. పీవీ జయంతి లోపు ఏదైనా ఓ జిల్లాకు ఆయన పేరు పెట్టే విషయమై సీఎం కేసీఆర్ ఓ నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, కాంచనపల్లి రాజేంద్రప్రసాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంత్రి సునీల్, అశోక్‌కుమార్, రమాకుమార్ దేశ్‌ముఖ్, విష్ణుదాస్ గోపాల్‌రావు, విజయలక్ష్మి తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అంబర్‌పేట: నియోజకవర్గంలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం గోల్నాక డివిజన్ కమలానగర్‌లో రూ.16 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.

బీసీ రుణాల దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచాలి

కవాడిగూడ: ఆర్థికంగా వెనుకబడిన బీసీలకు ఆర్థిక రుణాలు అందజేసేందుకు దరఖాస్తుల స్వీకరణ గడువును మరో పది రోజులకు పెంచాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లవెల్లి అంజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భోలక్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఆర్థిక రుణాల కోసం పేద ప్రజలు దరఖాస్తు చేసుకోవాలంటే తహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవాలలో రాష్ట్రవ్యాప్తంగా సర్వర్‌లు డౌన్ ఉండటంతో వేలాది మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. బీసీల పట్ల ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే అన్ని బీసీలకు ఆర్థిక రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు గడువును మరో పది రోజుల పాటు పెంచాలన్నారు. రామకృష్ణ, రాజు, రామానందరెడ్డి, విజయరావు, రవీందర్‌గౌడ్ తదితరులున్నారు.





కర్ణాటక సాహిత్య మందిర్‌లో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, సుందరయ్య పార్కులో కార్పొరేటర్ రవిచారి తదితరులు

యోగా మానవాళికి దివ్య ఔషధం



బాగ్‌అంబర్‌పేట పార్కులో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ పరిధిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. యోగా మానవాళికి రుషులు అందించిన దివ్య ఔషధమని పలువురు ప్రజా ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, విద్యాసంస్థల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించి ప్రజా ప్రతినిధులు యోగా చేసి ప్రాముఖ్యతను వివరించారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం



అంబర్‌పేట్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు భూషణ్‌చారి



బాపూనగర్‌లో ప్రగతి పాఠశాల విద్యార్థులు



యోగా చేస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్



బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు



నారాయణగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీ కార్పొరేటర్ మహాలక్ష్మి

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని బుధవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ దివంగత జయశంకర్ సార్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆసుపత్రి డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, డీఎంఓ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ డాక్టర్ అనిల్‌కుమార్, టీఎంహెచ్‌ఈయూ ఆసుపత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, కార్యదర్శి రాజ్‌కుమార్, సంతోష్, జనార్దన్ తదితరులున్నారు.

తెలంగాణ స్ఫూర్తి ప్రదాతకు ఘన నివాళి

చిక్కడపల్లి: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ గాంధీనగర్ డివిజన్ చౌరస్తాలోని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చూపిన స్ఫూర్తి ఆదర్శనీయమైందన్నారు. మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ, బీఆర్ఎస్ నాయకులు జైసింహ, నరేష్, శ్రీనివాస్‌గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులున్నారు.

'ఐద్వా' పరామర్శ

- కట్నం వేధింపులు తాళలేక మహిళ పిల్లలతో సహా ఆత్మహత్య
- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని 'ఐద్వా' డిమాండ్



సౌందర్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న 'ఐద్వా' బృందం

ముషీరాబాద్: బన్సీలాల్‌పేటలో అదనపు కట్నం కోసం వేధించి సౌందర్య, ఆమె పిల్లల మృతికి కారణమైన గణేష్‌ను అతడి కుటుంబసభ్యులను కఠినంగా శిక్షించాలని ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.పద్మ, కె.నాగలక్ష్మిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బాధితకుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం బోడుప్పల్‌కు చెందిన గణేష్‌తో వివాహమైనప్పటి నుంచి సౌందర్యను ఆమె అత్త, భర్త గణేష్‌లు తీవ్రమైన వరకట్న వేధింపులకు గురిచేసేవారని వేధింపులు తాళ్లలేకే ఆమె తండ్రిదండ్రుల వద్ద ఉంటుందన్నారు. చనిపోయే ముందు భర్తతో మాట్లాడిన ఆమె అతడి ప్రవర్తనతో మనస్తాపానికి గురై ఏడాదిన్నర వయసున్న తన ఇద్దరు కవల పిల్లలను 8వ అంతస్తుపై నుంచి కిందకు వేసి తాను కూడా దూకి చనిపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం సత్వర న్యాయ విచారణ జరిపి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది.

108 కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 108 కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌బాబుయాదవ్ తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ 108 ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలాజీ నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, వంశీధర్‌రెడ్డి, దేవేందర్‌రావు, స్వామి, మధుకర్, ఉదయ్, శేఖర్ తదితరులున్నారు.

కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలాకు వీడ్కోలు



అభివాదం చేస్తున్న కె.గీతామూర్తి

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మత్స్య, డైరీ, పశుపోషణ మంత్రి పురుషోత్తం రూపాలా నగరం నుంచి తిరిగి వెళ్తుండగా.. కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద కేంద్రమంత్రికి బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీలతో ప్రతినిధుల బృందం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గీతామూర్తి మాట్లాడుతూ.. గత 9 ఏళ్లలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రూ.5 లక్షల కోట్లు ఆర్థిక సాయం అందజేసిందన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఇటీవల పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారని ఆమె పేర్కొన్నారు.

పెన్షనర్లకు నగదురహిత చికిత్సను అందించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పెన్షనర్లందరికీ నగదు రహిత ఉచిత వైద్యచికిత్సలు అందించాల్సిన అవసరం ఉందని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్రబాబు, ఎం.వీ.నర్సింగ్‌రావులు తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో వారు మాట్లాడుతూ.. పెన్షనర్లందరికీ డీఆర్ బకాయిలను పూర్తిగా చెల్లించాలని మిగిలిన రెండు విడతల కరువుబత్యాన్ని విడుదల చేయాలన్నారు. నూతన పీఆర్‌సీని ఐఆర్‌తో సహా వెంటనే ప్రకటించాలని రూ.398 వేతనంతో నియమించబడిన ఉపాధ్యాయుల పెన్షన్‌ను తిరిగి క్రమబద్ధీకరించాలన్నారు. పీఆర్‌సీ 2020 సూచించిన అన్ని సమస్యలను ప్రభుత్వం ఆర్డర్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పై సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. జూలై 12న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురి రిమాండ్

ముషీరాబాద్: తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ పాత నేరస్తుడు, అతడికి సహకరిస్తున్న మరో ముగ్గురిని ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.80 వేల నగదు, నాలుగు తులాల బంగారం, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను రికవరీ చేశారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే ప్లాట్‌ఫామ్‌పై ఉంటూ.. ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్, రిసాల, దయారమార్కెట్, రాంనగర్ తదితర ప్రాంతాల్లో తాళంవేసిన ఇళ్లను గుర్తించి ముత్యాల ప్రసాద్ (36) పాత నేరస్తుడు తరచూ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గత 45 రోజుల్లో తొమ్మిది దొంగతనాలకు పాల్పడ్డాడు. అతడికి ఖమ్మం జిల్లా ద్వారకానగర్‌కు చెందిన విద్యార్థి మంద రాము, ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన గృహిణి బూడిద అనిత, ఆమె భర్త భవన నిర్మాణ కార్మికుడు బూడిద శ్రీహరిలు సహకరిస్తూ.. ముత్యాల ప్రసాద్ దొంగిలించిన వస్తువులను అమ్మిపెట్టడం, అతడికి ఆశ్రమం కల్పించడం, దొంగతనాల్లో సహకరిస్తున్నారు. ముషీరాబాద్ పోలీసులకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నిఘా పెట్టి ముత్యాల ప్రసాద్‌తో పాటు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరిన్ని వస్తువుల రికవరీ కోసం పోలీసు కస్టడీకి తీసుకోనున్నట్లు ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ తెలిపారు.

మసీదుల్లో శాంతి ప్రార్థనలు

కవాడిగూడ: సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్ సమీపంలోని మసీదులో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ప్రత్యేక శాంతి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ గెలుపొందడం ఖాయమని, మళ్లీ అధికారంలోకి వచ్చి సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని దీమా వ్యక్తం చేశారు. మసీదు పెద్దలు రఫీ, షబ్బీర్, రియాజ్, బీఆర్ఎస్ నాయకులు కల్వ గోపి, కుమార్, మల్లేష్, కార్తీక్‌యాదవ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీక్రాస్‌రోడ్డు తపాడియా డయగ్నొస్టిక్ సెంటర్ రోడ్డు పక్కనున్న ఫుట్‌పాత్‌పై 55 నుంచి 60 ఏళ్లున్న వృద్ధుడు మంగళవారం రాత్రి అపస్మారక స్థితిలో పడిఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అతడు అప్పటికే మృతి చెందాడు. ఎస్సై అభిలాష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది..



గురువయార్ ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: తెలంగాణలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాగ్‌అంబర్‌పేటలో గురువయార్ ఆలయంలో ఆధ్యాత్మిక ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులకు ప్రత్యేకంగా సన్మానించారు. కులమతాలకు అతీతంగా తెలంగాణలో ఆధ్యాత్మిక కేంద్రాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేశామన్నారు. ఆలయ అర్చకులు నీలకంఠ, అష్టమూర్తి సురేష్, విష్ణు, ఉన్నికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు శ్రీరామ్‌ముదిరాజ్, శేఖర్‌రెడ్డి గురుస్వామి, శివకుమార్ తదితరులున్నారు.

శ్యాంబాబా మందిర్‌లో ప్రత్యేక పూజలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు కాచిగూడలోని శ్యాంబాబా మందిర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని శ్యాంబాబా, వీరభద్రస్వామి, శివుడు, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, దుర్గామాత తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని దేవాలయాల అభివృద్ధి జరుగుతోందని తెలంగాణ రాష్ట్రమే ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా మారిందన్నారు. తిరుపతి తరహాలో యాదగిరిగుట్టను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ నేతలు రమేష్, పులి జగన్, నగేష్ గౌడ్, సులోచనరెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, జీవన్‌గౌడ్, మాధవరెడ్డి, జనార్దన్, చందర్, రాహుల్, దిలీప్‌కుమార్, కనకయ్య, శంకర్, బాబా, ప్రకాష్‌రెడ్డి, సాయిపూర్ణ, నాగమణి, వెంకటమ్మ, దుర్గ, లక్ష్మి, విజయలక్ష్మి, సూర్యలక్ష్మి, లావణ్య, పాండు, రాజు, దేవానంద్, శ్రీనివాస్, మహేష్ తదితరులున్నారు.


ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో చండీహోమం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం టీటీడీ బృందంచే పారాయణం, భక్తిగీతాల ఆలాపన జరిగింది. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, నగర బీజేపీనేత ఎ.వినయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్ పాల్గొన్నారు. ఈఓ దేవనాథం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా ఆర్టీసీక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈఓ లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొన్నారు.

కబేళా తాత్కాలిక లీజును రద్దు చేయాలి : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నేతలు ఎం.శ్రీనివాస్, పి.సత్యంలు

ముషీరాబాద్: టెండర్ లేకుండా చెంగిచెర్ల కబేళాను ఐదేళ్లుగా తాత్కాలిక లీజ్‌ను కొనసాగించడంపై సీపీఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా కమిటీ కార్యదర్శి సత్యంలు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ.. 'మేడ్చల్ జిల్లా చెంగిచెర్లలోని ఆధునిక కబేళా నిర్వహణ లీజ్ పొందిన మహ్మద్ సలీం అండ్ కంపెనీ గడువు 2018 జూలైలో ముగిసినా తాత్కాలిక లీజ్ పేరుతో పాత రేట్లతో గత ఐదేళ్లుగా కొనసాగిస్తున్నారన్నారు'. 'టెండర్ లేకుండా ఐదేళ్ల నుంచి లీజు కొనసాగించడంపై సమాధానం చెప్పాలని పశుసంవర్ధకశాఖ మంత్రిని కోరతామన్నారు'. కబేళా కాంట్రాక్ట్ పొందిన వ్యక్తి ప్రస్తుతం హజ్ కమిటీ చైర్మన్‌గా పనిచేస్తున్నాడన్నారు. దీనికి ముందు వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా పని చేశారన్నారు. ప్రభుత్వ హోదాల్లో ఉండి కాంట్రాక్టులు పొందడం పూర్తిగా చట్టవిరుద్ధమన్నారు. కబేళా లీజ్ ఒప్పందంపై విజిలెన్స్ విచారణ జరిపి అనేక అక్రమాలు జరిగాయని ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై నివేదిక ఇచ్చినా నేటి వరకు తగిన చర్యలు తీసుకోలేదన్నారు. లీజు అద్దె రూ.10 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేసినప్పటికీ సదరు కంపెనీ బేఖాతర్ చేసిందన్నారు. ఆ కంపెనీ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని స్థానిక వృత్తిదారుల సొసైటీకి కబేళా నిర్వహణను అప్పగించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు



సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: సీఎం కేసీఆర్ ఆదేశాలు, మంత్రి కేటీఆర్ సహకారంతో పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని గోల్నాక మార్కెట్ సమీపంలోని భాగ్యనగర్ బస్తీలో రూ. 17.5 లక్షలతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ వై. అమృతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ, సీవరేజీ పైపులు శిథిలావస్థకు చేరడంతో కుళాయిల ద్వారా కలుషిత నీటిసరఫరా అవుతుందని నిత్యం బస్తీలు కాలనీల్లో పాదయాత్రలు చేపట్టి జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నల్లపోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి ప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. బస్తీపెద్దలు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల బృందం పర్యటించాలి

కాచిగూడ: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో ఆదివాసీ క్రిస్టియన్ సమాజంపై జరుగుతున్న హత్యాకాండపైన ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రతినిధుల బృందం పర్యటించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఓ ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన జీవించే మానవహక్కుల ఉల్లంఘనపైన స్పందించాలన్నారు.

'అమరవీరుల స్తూపం ప్రారంభించే అర్హత సీఎంకు లేదు'



తోట లక్ష్మీకాంతరావు

కాచిగూడ: తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని ప్రారంభించే అర్హత సీఎం కేసీఆర్‌కు లేదని తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ తోట లక్ష్మీకాంతరావు విమర్శించారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. 1200 మంది అమరవీరుల కుటుంబాలకు ఒక ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.10 లక్షల ఆర్థిక సాయం చేస్తామని అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించి విస్మరించారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో వీరమరణం పొందిన అమరవీరుల త్యాగ ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఆ కుటుంబాలు రోడ్డుపాలైనా ఏ మాత్రం సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన యువతీయువకుల త్యాగాలకు తగిన గుర్తింపు ఇచ్చి అమరవీరుల కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబసభ్యుల్లో ఒకరికి రూ.25వేల పెన్షన్ అందజేస్తామన్నారు.